www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 19 జూన్ 2025
5
తూర్పుగోదావరి

ఆరు డ్రెడ్జింగ్ బోట్లు సీజ్

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లరేవు డి సిల్టేషన్ పాయింట్ వద్ద ఆరు డ్రెడ్జింగ్ బోట్స్‌ను అధికారులు సీజ్ చేశారు. ప్రస్తుతం ఇసుక తవ్వకాలపై నిషేధం ఉన్న నేపథ్యంలో బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు అనధికారికంగా డ్రెడ్జింగ్ నిర్వహిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి, తహాశీల్దార్ లక్ష్మీలావణ్య, ఎస్ఐ ఆంజనేయులు సంబంధిత బోట్స్‌ను సీజ్ చేశారు.

డ్రెడ్జింగ్ బోట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

తప్పుడు డేటాతో

తల్లికి వంచన

పలువురు తల్లికి వందనానికి దూరం

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన 'తల్లికి వందనం' జాబితాలో తప్పుడు డేటా కారణంగా పలువురు పథకానికి దూరమయ్యారు. భూమి లేకున్నా ఉన్నట్లు... ఒక్కరికే రెండు మూడు విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు... అధిక యూనిట్లు వాడినట్లు, ఫోర్ వీలర్ ఉన్నట్లు జాబితాలో రావడంతో వారు పథకానికి అనర్హులయ్యారు. వీటిని సరిదిద్దుకోవడం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులు సుమారు 7.56 లక్షల మందికి పైగా ఉన్నారు. వీరిలో 5,22,648 మందిని అర్హులుగా గుర్తించారు. 2,34,268 మందిని వివిధ కారణాలతో పథకానికి దూరం అయ్యారు.

తూర్పు గోదావరి జిల్లాలో 1,88,226 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 1,23,779 మందిని అర్హులుగా గుర్తించారు. వారికి రూ.240 కోట్లు జమ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. వారి లెక్కల ప్రకారమే జిల్లాలో 64,447 మందికి తల్లికి వందనం అందలేదు. మొత్తంగా 2.80 మంది విద్యార్థులున్నారు. కాకినాడ జిల్లాలో ఒకటి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు 2.80 లక్షల మంది ఉన్నారు. ఇంటర్ విద్యార్థులు 48,690 వరకూ ఉన్నారు. మొత్తంగా 3,28,690 మంది వరకూ విద్యార్తులున్నారు. కాని 2.28 లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం డబ్బులు జమయ్యాయి. 1,00,690 మందికి పథకాన్ని దూరం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్‌వరకూ చదివే విద్యార్థులు 2.40 లక్షల మంది వరకూ ఉన్నారు. వీరిలో 1,70,869 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి సంబంధించి 1,12,419 మంది తల్లుల ఖాతాలో రూ.250 కోట్లు జమ చేశారు. మిగిలిని 69,131 మందికి ఈ పథకాన్ని వర్తింపజేయలేదు. అర్హుల జాబితాలో పేర్లు ఉన్న కొంత మందికి కూడా ఇంకా నగదు జమకాలేదు. వారుసైతం బ్యాంకుల చుట్టూ, పోస్టాఫీసుల చుట్టూ ఇంకా తిరుగుతూనే ఉన్నారు.

gsws-nbm.ap.gov.in/NBM/#!/ApplicationStatusCheckP

Basic Details

DISTRICT	MANDAL	SECRETARIAT CODE	SECRETARIAT NAME	CLUSTER CODE	BENEFICIARY NAME	MOBILE NUMBER
EAST GODAVARI	TALLAPUDI	10590071	POCHAVARAM	10590071001	Dake Syamala	XXXXXX9399

సెంటు భూమి కూడా లేని దాకే శ్యామల అనే మహిళకు 10 ఎకరాలు ఉన్నట్టు చూపుతున్న వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ స్టేటస్

APPLICATION NUMBER	APPLICATION DATE	APPLICATION STATUS	REMARKS
1202601760-Dake Sudeep Vincent	12-JUN-2025	Ineligible	Dry land more than and equal to 10 Acres
1202452370-Dake Roshini	12-JUN-2025	Ineligible	Dry land more than and equal to 10 Acres

భూమి ఎక్కడ ఉందో చూపించండి...

మాకు ఇద్దరు పిల్లలు. తల్లికి వందనం అందుకునేందుకు ఇద్దరికీ అర్హత ఉంది. మాకు ఎలాంటి భూమి లేదు. కాని జాబితాలో నా పేరున మూడు కుంచాల రెండు సెంట్లు భూమి ఉందని. తన భార్యపై వేములవాడలో మూడు ఎకరాలకు పైగా భూమి ఉందని చూపారు. దీంతో ఇద్దరికీ తల్లికి వందనం నగదు జమకాలేదు. కరెంటు బిల్లు కూడా ఎప్పుడూ 300 యూనిట్లు వచ్చిన దాఖలాలు లేవు. భూమి ఎక్కడ ఉందో చూపిస్తే అద్దైనా సాగుచేసుకుంటాం.

- కట్టా రామకృష్ణ, వలసపాలక, కరప మండలం

10 ఎకరాలు చూపిస్తే సాగుచేసుకుంటాం...

మాది తాళ్లపూడి మండలం పోచవరం. నాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనంలో నా పిల్లలను అనర్హులుగా చూపించారు. దీనికి కారణం ఏంటని ఆరా తీస్తే నా పేరున 10 ఎకరాలకు పైగా పొలం ఉందని చెప్పారు. కనీసం ఈ పొలం ఎక్కడ ఉందో చూపిస్తే బుద్ధిగా వెళ్లి సాగుచేసుకుంటాను.

- దాకే శ్యామల, పోచవరం, తాళ్లపూడి మండలం

తప్పుడు సాకులతో ఎగ్గొడుతున్నారు...

మాది రంపయర్రంపాలెం. నా కుమార్తె సోనీ రంపయర్రంపాలెం పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటిందని చెప్పి తల్లికి వందనం వేయలేదు. మేము అద్దె ఇంట్లో ఉంటున్నాము. గత ప్రభుత్వంలో బాగానే అమ్మ ఒడి వచ్చింది. కష్టపడి పనిచేసుకుంటేనే రోజు గడిచే బతుకులు మావి. లేనిపోని కారణాలతో తల్లికి వందనం ఎగ్గొడుతున్నారు.

- చాకలి రాము, రంపయర్రంపాలెం, గోకవరం మండలం

150 యూనిట్లు కూడా ఎప్పుడూ రాలేదు...

నాకు ఇద్దరు కుమారులు. వీరిద్దరికీ తల్లికి వందనం నిధులు పడలేదు. కారణం ఏంటని ఆరా తీస్తే విద్యుత్ వాడకం 300 యూనిట్లు దాటింది, అందుకే పడలేదని చెబుతున్నారు. మాకు ఏనాడూ 150 యూనిట్లు మించి కరెంటు బిల్లు రాలేదు. విద్యుత్ కార్యాలయానికి వెళ్లి అడిగితే ఏడాది రిపోర్టు తీసి ఇచ్చారు. ఇందులో కూడా ఎక్కడా 150 యూనిట్లు కూడా దాటలేదు. ఇలాంటి కారణాలతో పథకాన్ని ఆపడం సరికాదు.

- దర్శిపూడి సూర్యలక్ష్మి, రంపయర్రంపాలెం, గోకవరం మండలం

రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

యాంత్రీకరణతో మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి - కోరుకొండ

యాంత్రీకరణ విధానం ద్వారా వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేకూరుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం మండలంలోని బొల్లెద్దుపాలెంలో గ్రామంలో వ్యవసాయ యాంత్రీకరణ యూనిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ యూనిట్స్ ఏర్పాటుకు సంబంధించి 211 రైతు సేవా కేంద్రాల పరిధిలో 675 వివిధ యూనిట్స్ గ్రౌండింగ్ చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా రూ.3,58,27,637 సబ్సిడీ రూపంలో రైతులకు ప్రయోజనం చేకూర్చినట్లు వెల్లడించారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక పరికరాలు, యూనిట్స్‌ను అవసరానికి అనుగుణంగా ఒకరికొకరు యిచ్చిపుచ్చుకుని, వాటి ద్వారా పొందే ప్రయోజనాలు అందరికీ అందుబాటులో దక్కేలో చూసుకోవాలని సూచించారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగులు మందులు వెదజల్లే ప్రక్రియను వ్యవసాయ సాగు పద్ధతుల్లో అమలు చేయడం జరుగుతోందని వివరించారు. ఈ ప్రక్రియ వల్ల క్రిమి సంహారక మందులు ప్రభావం రైతులపై పడే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. వృధాను గణనీయంగా తగ్గించడం ఈ ప్రక్రియలో సాధ్యం అవుతుందని తెలిపారు. పంట మార్పిడి విధానాలు స్వాగతించాలనీ, ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచడంతోపాటు, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణంపై దృష్టి సారించాలని కోరారు. తద్వారా భూమి సారవంతం అవ్వడం, మేలైన దిగుబడులు సాధ్యం అవుతుందని తెలిపారు. నేటి ఆధునిక కాలంలో వ్యవసాయ రంగంలో మార్పులు గమనించి ఉత్తమ సాగు విధానాలు అవలంబించాలని సూచించారు. హార్టికల్చర్ రంగం ద్వారా అంతర పంట సాగు విస్తీర్ణం ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. సత్యసాయి తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, సహాయ సంచాలకులు మల్లికార్జునరావు, రైతులు పాల్గొన్నారు.

ఖాతాతో పాటు ఇన్సూరెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి - తాళ్లపూడి

యూనియన్ బ్యాంకులో పొదుపు ఖాతాతోపాటు, ఇన్సూరెన్స్ పాలసీని తీసుకుంటే అవసర సమయంలో ఆ కుటుంబానికి బీమా సౌకర్యం లభిస్తుందని యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు తెలిపారు. ఈ బ్రాంచ్‌లో పొదుపు ఖాతాతో పాటు ఇన్సూరెన్స్ పాలసీ కలిగి ఉండి ఇటీవల మృతి చెందిన వేగేశ్వరపురం గ్రామానికి చెందిన శీర్ల గన్నెమ్మకు మంజూరైన ఇన్సూరెన్స్ పాలసీ లక్ష రూపాయలు బుధవారం ఆమె భర్తకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కును అందిస్తున్న బిఎం నాగరాజు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ముప్పిడి

సమన్వయంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రజలతోపాటు గ్రామ, మండల అభివృద్ధి జరగాలంటే రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతోనే సాధ్యమని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఎంపిపి దొనకూటి పోసిరాజు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని ఏడాది కాలంలోనే చేసి చూపించామని అన్నారు. రానున్న రోజుల్లో మండలాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. అందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులంతా సహకరించాలని సూచించారు. మండలానికి ఇద్దరు ఎంఇఒలు ఉన్నా ఒక్క ఎంఇఒ కూడా ఏ సమావేశానికి రావడం లేదని వారికి మెమో ఇవ్వాలని ఎంపిడిఒను ఆదేశించారు. పిహెచ్‌సిలో అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌ఛార్జ్ ఇఒపిఆర్‌డి వీరన్న మాట్లాడుతూ నియోజకవర్గంలో మూలన పడి ఉన్న మినీ జెసిబిని మండలానికి కేటాయిస్తే కొన్ని పనులు చేసుకుని అవకాశం ఉంటుందని కోరారు. పలు శాఖల అధికారులు శాఖా పరంగా తాము సాధించిన అభివృద్ధిని వివరించారు. ఎంపిడిఒ వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల బదిలీ అయిన ఎంపిడిఒ రమణ వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు.

సిఎం సహాయ నిధి పేదలకు వరం : మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - నిడదవోలు, పెరవలి

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద ప్రజలకు వరం లాంటిదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ కారణాలతో అనారోగ్యం బారిన పడి ఆసుపత్రుల్లో చికిత్స పొందిన, పొందుతున్న 32 మంది పేదలకు రూ.19,92,477 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు. నిడదవోలు నియోజకవర్గంలో సిఎంఆర్ఎఫ్ ద్వారా 159 మందికి రూ.1.53 కోట్ల లబ్ధి అందించామని తెలిపారు. నిడదవోలు పట్టణంతో పాటు, రూరల్, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని పలువురికి సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామన్నారు. కోరుమామిడికి చెందిన పసలపూడి నాగచంద్రం బేబీకి రూ.4 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి సిఎంఆర్ఎఫ్ భరోసా కల్పిస్తుందన్నారు. పేదలు డబ్బుల్లేక, వైద్యం అందక చనిపోయే పరిస్థితి రాకూడదనే లక్ష్యంతో ఎప్పటికప్పుడు సిఎంఆర్ఎఫ్ ద్వారా వైద్యానికి అయ్యే ఖర్చును మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో వైద్య రంగానికి ప్రాధాన్యతనిస్తూనే ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నామన్నారు. పిహెచ్‌సి, సిహెచ్‌సి, హెల్త్ క్లినిక్‌లలో అవసరమైన సదుపాయాలను మెరుగుపర్చడం జరుగుతుందన్నారు. ఆయా క్లినిక్‌లకు అవసరమైన మందులు, ఇతర అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. పెరవలి మండలంలో ఏడుగురి లబ్ధిదారులకు మంత్రి దుర్గేష్ చెక్కులు అందజేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

విద్యా కానుక కిట్ల అందజేత

ప్రజాశక్తి - నిడదవోలు, గోకవరం

నిడదవోలు జడ్‌పి బాలికల హైస్కూల్ విద్యార్థినులకు సర్వేపల్లి రాధావృష్ణ విద్యా కానుక కిట్లు పంపిణీ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్‌పర్సన్ అడపా ఆదిలక్ష్మి, హెచ్ఎం అరుణరాజేశ్వరి చేతుల మీదుగా కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భూపతి ఆదినారాయణ, కూటమి పార్టీల నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, మోర్త ప్రమోద్ కుమార్, తిరుపతి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే గోకవరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. హెచ్ఎం పిఎస్ఎన్.రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ బి.రత్నాజీ పాల్గొని విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా రహిత మండలంగా పెరవలి

ప్రజాశక్తి - పెరవలి

సారా రహిత మండలంగా పెరవలికి గుర్తింపు వచ్చిందని ఎక్సైజ్ సిఐ సతీష్ తెలిపారు. రాష్ట్రాన్ని సారా రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'నవోదయం 2.0' కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కానూరు, కానూరు అగ్రహారం, నడుపల్లికోట, ఉసులుమర్రు గ్రామాల్లో పలువురిపై సారా కేసులు నమోదు అయ్యాయని అన్నారు. గత రెండేళ్ల కాలంలో గతంలో కేసులు ఎదుర్కొన్న వారంతా ఇతర వృత్తులలోకి వెళ్లినట్లు గుర్తించామని తెలిపారు. ఆయా గ్రామాల్లో గత రెండేళ్లలో ఒక్క సారా కేసు నమోదు కాలేదన్నారు. దీంతో ఆయా గ్రామాలను నాటు సారాయి రహిత గ్రామాలుగా గుర్తించి మండలాన్ని సారా రహితంగా గుర్తించినట్లు తెలిపారు. రానున్న కాలంలోనూ ఇదే తరహాలో ముందుకు సాగాలని, అందుకు గ్రామ పెద్దలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.సీతారాంప్రసాద్, జడ్‌పిటిసి కొమ్మిశెట్టి రామాంజని, తహశీల్దార్ కె.నిరంజన్, ఎంపిడిఒ కెవిఆర్ఎల్.పద్మజ, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కర్లు, ఎలక్ట్రికల్ స్టవ్‌లు అందజేత

ప్రజాశక్తి - కొవ్వూరు

అంగన్‌వాడీలకు కుక్కర్లు ఇస్తున్న సిడిపిఒ నాగలక్ష్మి

ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడి కేంద్రాలకు ఎలక్ట్రికల్ స్టవ్, కుక్కర్‌లు, ఇతర సామాగ్రిని అందిస్తున్నామని సిడిపిఒ కె.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం ప్రాజెక్టు పరిధిలో ఉన్న 223 కేంద్రాల్లో కొవ్వూరు పట్టణ, రూరల్ మండల పరిధిలో ఉన్న 114 కేంద్రాలకు మొదటి విడతగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలకు కేంద్రాల్లోనే భోజనం వండేందుకు వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. సొంత భవనాలు ఉన్న అంగన్ వాడి కేంద్రాలకు పిల్లలు ఆడుకునేందుకు ప్లే మెటీరియల్ అందిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలకు, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు హోమ్ టూర్ రేషన్ అందిస్తున్నామన్నారు. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేలు విలువైన సోమాగ్రిని అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు.

నేటి నుంచి ట్రాఫిక్ దారి మళ్లింపు

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు నుంచి తాడేపల్లిగూడెం వయా నిడదవోలు వైపు వెళ్లే వాహనాల రాకపోకలను గురువారం నుంచి దారి మళ్లించినట్లు ఆర్‌డిఒ రాణిసుస్మిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం మరియు ఐ.పంగిడి నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్ళే వాహనాలను నల్లజర్ల మీదుగా తాడేపల్లిగూడెం వెళ్లాల్సివుంటుందన్నారు. తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలు నల్లజెర్ల, ఐ.పంగిడి మీదుగా రాజమహేంద్రవరం వెళ్లాల్సివుంటుందన్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు నుంచి వెళ్లే వాహనాలు విజ్జేశ్వరం, గోపవరం, డి. ముప్పవరం, కానూరు, తణుకు మీదుగా తాడేపల్లిగూడెం వెళ్లాల్సివుంటుందని తెలిపారు. తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలు తణుకు, కానూరు, డి.ముప్పవరం, గోపవరం మీదుగా విజ్జేశ్వరం మీదుగా కొవ్వూరు, రాజమహేంద్రవరంకు రావాలన్నారు. అలాగే నిడదవోలు నుంచి బయలుదేరే వాహనాలు కోరుమామిడి, అప్పారావు పేట మీదుగా తాడేపల్లిగూడెం వెళ్లాలని, అలాగే తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలు అప్పారావుపేట, కోరుమామిడి మీదుగా నిడదవోలు రావాలన్నారు. కావున ప్రయాణికులు, వాహనదారులు రాకపోకల మళ్లింపునకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

20న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు, గోపాలపురం

చాగల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎఇ ఎస్.త్రిమూర్తులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాగల్లు, నెలటూరు, మీనానగరం, అమ్మగుంట, ఉనగట్ల గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు సరఫరా చేస్తామని, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి మిగిలిన విద్యుత్‌ను సరఫరా చేస్తామని అన్నారు. అలాగే గోపాలపురం సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కేవీ పరిధిలోని సత్య సాయి ఇండస్ట్రియల్ ఫీడర్ ఆర్‌డిఎస్ఎస్ వర్క్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఎఇ డి. శ్రీనివాసరావు వెల్లడించారు. అలాగే ఆర్‌డిఎస్ఎస్ న్యూ బ్రేకర్ వర్క్ ఎరక్షన్ నిమిత్తం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు గోపాలపురం 33/11 కెవి సబ్‌స్టేషన్‌కి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మండల సమావేశాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, పెరవలి, చాగల్లు

ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వివివిఎస్.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశం హాల్లో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అలాగే పెరవలి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కెవిఆర్ఎల్.పద్మజ తెలిపారు. ఈ సమావేశం ఎంపిపి కె.సీతారాంప్రసాద్ అధ్యక్షతన జరుగుతుందన్నారు. అలాగే చాగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపిపి మట్టా వీరాస్వామి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరవుతున్నట్లు వెల్లడించారు. కావున ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కార్టూ'నిజం'

ఆ తల్లికి 21 మంది పిల్లలంట!!!

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - గోకవరం, కడియం

స్థానిక సంజీవయ్యనగర్ ఎంపియుపి, హైస్కూల్లో గత ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వెళ్తున్న వారికి బుధవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు ఎన్.ఉమామహేశ్వరరావు, ఎస్.కుమార్, వై.సుమతి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు, కాలనీ ప్రజలు పూలమాలలు, శాలువాలతో సత్కరించి షీల్డ్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ ప్రమీల, హెచ్ఎంలు కె.బల్లబ్బాయి దొర, పి.సాయిబాబు, వార్డెన్ రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు తోలేటి రమ్యశ్రీ, ఉనుకూరి అసిరమ్మ, స్థానికులు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కడియం జడ్‌పి ఉన్నత పాఠశాలలో గత ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయునిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణను సత్కరించారు. బుధవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశం అనంతరం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి సత్యనారాయణ నిరంతరం శ్రమించారని కొనియాడారు. మండల ప్రతిపక్ష నాయకుడు గిరజాల బాబు మాట్లాడుతూ తన సొంత నిధులతో పేద విద్యార్థులకు సహాయపడ్డారని, పాఠశాలకు బెంచీలు, మైక్ సెట్, కుర్చీలు మొదలగు లక్షల విలువ చేసే వస్తువులను సమకూర్చారన్నారు.

గోకవరంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న స్థానికులు

సమావేశంలో వివరణ ఇస్తున్న డిఇఇ సత్తిబాబు

వాడివేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి - కడియం

మండల సర్వసభ్య సమావేశం బుధవారం వాడీ వేడీగా సాగింది. ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల ప్రతిపక్ష నాయకుడు గిరజాల బాబు, జేగురుపాడు సర్పంచ్ వై.స్టాలిన్ పలు అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు. ఉచిత పంటల బీమా, ఉచిత ఇసుక దోపిడీ, జల్ జీవన్ మిషన్ పనులు, మోడల్ ప్రైమరీ స్కూల్స్, కడియం ఆవ ముంపు, జగనన్న లేఔట్‌లలో సమస్యలు, తల్లికి వందనం, హౌసింగ్, విద్యుత్ బిల్లుల సమస్యలు తదితర అంశాలపై వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. దీనిపై సంబంధిత అధికారులు క్లుప్తంగా సమాధానాలు ఇచ్చారు. జేగురుపాడు జగనన్న లేఔట్‌లో తాగు నీటి సమస్యకు అంచనాలు రూపొందించి తక్షణం పనులు చేపట్టాలని ఎంపిపి ప్రసాద్ అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో కడియంలో రైతు బజార్‌కు స్థలం కేటాయిస్తే ఆ స్థలంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించేందుకు శంకుస్థాపన చేయడాన్ని ప్రతిపక్ష సభ్యులు తప్పుబట్టారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె.రమేష్, తహశీల్దార్ సునీల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - చాగల్లు

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఆర్‌టిసి బస్సు ఢీకొన్న సంఘటన చాగల్లు మండలం ఎస్.ముప్పవరంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...నిడదవోలు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు పోలవరం నుంచి నిడదవోలు వైపు వెళుతుండగా రోడ్డుపై ఆగి ఉన్న ఇసుక ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఇద్దరు ప్రయాణికులు స్వల్ప గాయాలపాలయ్యారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణానికి చెందిన అంబటి కోటినాగు అనే వ్యక్తి ఈనెల 11వ తేదీ నుంచి కనిపించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. 11వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిఐ తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు 9440796622 నెంబర్‌కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

రాణి ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా బుధవారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ బీచ్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి ఆర్‌ఒఎ మునిస్వామి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లు ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యకరమైన జీవనం

ప్రజాశక్తి - యానాం

జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ డిపార్ట్మెంట్, టూరిజం డిపార్ట్మెంట్ సంయుక్తంగా 25 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా బుధవారం స్థానిక ఎస్ఎస్ఎ కాన్ఫరెన్స్ హాల్లో మదర్ థెరిస్సా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్ఎఒఎ మునిస్వామి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడుతుందన్నారు.

రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - యానాం

యానాం బ్రహ్మానంద నగర్ కాలనీలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధులు సుమారు రూ.54 లక్షలతో బ్రహ్మానందనగర్ కాలనీలో రోడ్లు, డ్రైన్లు నిర్మించనున్నారు. ఎన్నో ఏళ్లుగా రోడ్లు, డ్రెయిన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీవాసులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లడంతో ఎంపీ నిధులతో నిర్మించేవిధంగా తక్షణ చర్యలు తీసుకున్నారు. నిధులు కేటాయించి రోడ్ల నిర్మాణానికి సహకరించినందుకు కాలనీవాసులు ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్, ఎంపీ సెల్వ గణపతికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ కాళ్ళ నాగరాజు, జెఇలు జ్యోతిరాజు, ప్రసాద్, గొల్లపల్లి అభిమానులు, కాలనీ వాసులు, గొల్లపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులపై ఎంఎల్ఎ గొల్లపల్లి ఆగ్రహం

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖ (పిడబ్ల్యుడి) అధికారులపై స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిడబ్ల్యుడి ఆఫీస్‌లో బుధవారం సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆర్ఎఒ మునిస్వామి తీరుని ఖండిస్తూ, అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ, ఎంఎల్ఎ నిధులతో అభివృద్ధి పనులు చేయకపోగా జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు చేతిలో కీలుబొమ్మలా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తాను తెచ్చిన నిధులతో భూమి పూజ చేసేందుకు మాజీ మంత్రి మల్లాడిని కూడా రమ్మని పిలవడం హాస్యాస్పదమన్నారు.

యోగాసన పోటీల్లో సత్తా చాటిన తండ్రీకొడుకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

యోగాంధ్ర యోగాసనా పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన తండ్రి కొడుకులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 35 ఏళ్ల పైబడిన వారి విభాగంలో యోగ షార్ట్ ఫిలింలో ద్వితీయ స్థానం, యోగ ఫోటోగ్రఫీ విభాగంలో తృతీయ స్థానాలను యోగా గురువు కర్రి నాగవెంకట శ్రీధర్ సాధించగా, ఆయన కుమారుడు కార్తీక్ రామచంద్రా 10 నుంచి 18 ఏళ్ల విభాగంలో యోగ ఫోటోగ్రఫీ విభాగంలో ప్రథమ స్థానం, షార్ట్ ఫిలిం విభాగంలో తృతీయ స్థానం సాధించారు. విజేతలను రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, సత్యప్రసాద్ యాదవ్, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మి షా, రాష్ట్ర ఆయుష్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ సర్టిఫికేట్, మెమెంటోలతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

సిహెచ్‌సి వైద్యాధికారిగా సునీత

ప్రజాశక్తి -తాళ్లరేవు

కమ్యూనిటి హెల్త్ సెంటర్ వైద్యాధికారిగా సివిల్ అసిస్టెంట్ సర్జన్ వి.సునీత నియమితులయ్యారు. ఆసుపత్రిలో ఇప్పటికే వైద్యసేవలు అందిస్తున్న సునీతను నియమిస్తూ డిస్ట్రిక్ట్ కన్వీనర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డిసిహెచ్) నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఇటీవల ఆసుపత్రిలో శిశు మరణం నేపథ్యంలో ఇప్పటివరకూ పనిచేసిన వైద్యాధికారి స్నేహలత సస్పెండ్ అవడంతో ఈ నియామకం చేపట్టారు.

అభ్యాసకుల మ్యాపింగ్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు శిక్షకులతో అభ్యాసకుల మ్యాపింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి వేడుకల నిర్వహణపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యోగా సాధన కోసం గత నెల రోజులుగా వివిధ రంగాల వారితో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో యోగా సాధన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. యోగా సాధన ఒక కార్యక్రమంలా కాకుండా సామాజిక చైతన్యం కలిగించే ప్రక్రియగా ప్రజలను స్వచ్ఛందంగా భాగస్వామ్యం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 8,52,157 మందిని రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల, గ్రామ, సచివాలయం పరిధిలో వారి పేర్లు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో 5,637 ప్రాతాలను గుర్తించామని, వాటిలో 5554 మంది మాస్టర్ ట్రైనర్స్‌తో 8,51,105 మందిని అనుసంధానం చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని తెలిపారు. నగరంలోని 14 ప్రాంతాల్లో, జిల్లా వ్యాప్తంగా 5554 ప్రాంతాల్లో యోగా సాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక రికార్డు స్థాయిలో భాగస్వామ్యం కావాలని, విద్యార్థులలో ఉత్సుకత పెంచాలని, విద్యార్థులు తల్లితండ్రులతో కలిసి పెద్ద ఎత్తున పాల్గొనేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ జెసి, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

నన్నయకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి - రాజానగరం

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్టును అందుకుంటున్న విసి ప్రసన్నశ్రీ

నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మెగా యోగాంధ్రా కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సాధించిందని విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. బుధవారం నన్నయలో మెగా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో పరిధిలోని రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు హాజరై యోగాసనాలు చేశారు. అనంతరం విసి మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయంలో 16,123 మంది విద్యార్థులతో మెగా యోగాంధ్ర కార్యక్రమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారికంగా ప్రకటించిందని తెలిపారు. తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్టును సంస్థ నిర్వాహకులు విసికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, విశ్వవిద్యాలయ అధికారులు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు డాక్టర్ రాయుడు.సికె, తాతా వెంకట వరప్రసాద్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి

ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యాసంస్థలు నడుపుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎల్‌వి కళాశాల, విద్యా సంస్థ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు స్పందించిన మండల విద్యాశాఖ అధికారి ఎస్ఎల్‌వి కళాశాలకు వచ్చి పుస్తకాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు చవాకుల నరసింహ మూర్తి మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కళాశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం అమ్ముతున్నాయని, వాటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు వివిధ కోర్సుల పేరు చెప్పి అధిక మొత్తంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై జిల్లా అధికారులు పర్యవేక్షణ చేసి అనుమతులు లేని నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహమూర్తి, మణికంఠ సాయి పాల్గొన్నారు.

వసతి, విద్యా దీవెన బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ప్రయివేటు కళాశాల విద్యార్థులకు బకాయి పడ్డ వసతి దీవెన, విద్యా దీవెన ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించి ఆదుకోవాలని జిల్లా ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాం బుధవారం కలెక్టర్ పి.మహేష్ కుమార్, జెసి నిషాంతిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 23-24 సంవత్సరానికి సంబంధించి 3 టర్మలు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం 24-25 విద్యా సంవత్సరానికి సంబందించి 3 టర్మలు ఫీజులను ఇంతవరకు కళాశాలలకు జమ చేయలేదన్నారు. విద్యా సంస్థలు మనుగడ ప్రశ్నఅర్ధకంగా మారిందని వారు వాపోయారు. కళాశాలల గుర్తింపు రెన్యువల్ విదానాన్ని 5 సంవత్సరాలకు ఒకసారి పెట్టాలని, సీట్లు భర్తీ విషయంలో మేనేజ్ మెంట్ కోటాను తొలగించి కన్వీనర్ కోటాలో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ కళాశాల అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కరాటం విఆర్ ఎన్.నరసింహరావు, ఉపాధ్యక్షులు ఆకుల బాపన్న నాయడు, మద్దింశెట్టి రాంబాబు, కరాటం ప్రవీణ్, నల్లా తమ్మేశ్వ రరావు, జి. బ్రాహ్మానందం, వి.సాయి ప్రసాద్, సత్య ప్రసాద్,డి. బాబి,కే సత్తిబాబు, నలినీ కుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

మురికినీటి డ్రెయిన్ పూడిక తీత పనుల ను బుధవారం చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి పర్యవేక్షించారు. ఆలమూరు, జొన్నాడలకు చెందిన పంట భూముల్లో వర్షాలకు ముంపు గురై రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఇటీవల ఆయన దృష్టికి రైతులు తీసుకొచ్చారు. దీంతో ఆయన స్థానిక ఎంపిడిఒ ఎ.రాజుకు ఈ డ్రెయిన్ పరిస్థితిని వివరించారు.ఈ డ్రెయిన్ పూడిక తీతకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఆదేశాలు ఇచ్చారు. సుదీర్ఘ కాలంగా ఈ డ్రెయిన్ తవ్వకాలు చేపట్టకపోవడంతో డ్రెయిన్ మూసుకుపోయి మురుగునీరు దిగుకు వెళ్లడం లేదని దీంతో డ్రెయిన్ తవ్వకాలు ప్రారంభించినట్లు శ్రీనివాస్ చౌదరి తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలో ఇటీవల మరణించిన పలువురు కుటుంబ సభ్యులను బుధవారం ఎంఎల్ వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల మరణించిన మండపేట పట్టణ 13వ వార్డు గొట్టుపల్లి లత, పాలచర్ల కిట్టయ్య, 14వ వార్డు దొడ్డిపట్ల సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ పరామర్శలలో ఎమ్మెల్యే వెంట మేడింటి సూర్యప్రకాష్, ఇరవాడ లక్ష్మి ప్రసాద్, తమ్మా శివశ్రీ, పలివెల వెంకన్న తదితరులు, పాల్గొన్నారు.

ప్రజలకు వైసిపి శ్రేణులు అండగా నిలవాలి

ప్రజాశక్తి - పి.గన్నవరం

కూటమి ప్రభుత్వం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు వైసిపి నాయకులు, కార్యకర్తలు అండగా నిలిచి భరోసా కల్పించాలని నియోజకవర్గ కన్వీనర్ గన్నవరపు శ్రీనివాస్ అన్నారు. పి.గన్నవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాల యాన్ని బుధవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల శాఖ అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్ పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. వైసిపి అభివృద్ధికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు .పార్లమెంటు పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అశాంతి అలజడి సృష్టిస్తూ అరాచకంగా మారిందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా పి.గన్నవరం మండల వైసిపి అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ శ్రేణులు కేకు కట్ చేసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌సిలు తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్, రామచంద్రపురం నియోజవర్గ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్, కుడిపూడి సూర్యనారాయణ, సీనియర్ నాయకులు పికె.రావు, జడ్‌పిటిసి సభ్యులు గోడపాటి రమాదేవి, కశిరెడ్డి అంజిబాబు, బూడిద వరలక్ష్మి, అంబాజీపేట మండల అధ్యక్షులు విత్తనాల చంద్రశేఖర్, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు విద్యపై ఆసక్తి కలిగించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

చిన్నపిల్లలకు చిన్నతనం నుంచే విద్యపై ఆసక్తి కలిగించాలని, దీనికి తల్లిదండ్రులతో పాటు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని వెంకటాయపాలెం సర్పంచ్ ఎల్లమెల్లి సతీష్ కుమారి పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో రామచంద్రపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక అక్షరా భ్యాసం కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గ్రాడ్యుయేషన్ డే, అక్షరాభ్యాసం, అంగన్‌వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన ఇండక్షన్ స్టౌవ్స్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిఎంఎస్‌కె.తులసి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదం డ్రులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్ వాడీ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఉప్పలగుప్తం: అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని పలువురు సూచించారు. భీమనపల్లి పంచాయతీ సింగరాయపాలెం నెం.122 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో నగరపాలక సంస్థ అధికారులతో ముంపు ప్రాంతాల సమస్యపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితిపై ఒక అంచనా వేయాలని సూచించారు. ప్రధానంగా హైటెక్ బస్టాండ్, తుమ్మలోవ, కృష్ణానగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, విఎల్.పురం సహా నగరంలోని 13 ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయని, వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నీటిని తోడేందుకు ఉపయోగిస్తున్న డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్లు పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలన్నారు. వర్షపునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా డ్రెయినేజీలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రతి వర్షాకాలంలోనూ ప్రజలు తరచూ ఇబ్బందులకు గురికాకుండా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, ఎంహెచ్ఒ ఎ.వినూత్న, డిసిపి శ్రీనివాస్, ఇఇలు మాధవి, రీటా, అలీషేక్, సిఒసి రవితేజ పాల్గొన్నారు.

కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌పై బదిలీ వేటు

ప్రజాశక్తి - కొవ్వూరు

మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌పై బదిలీ వేటు పడింది. తక్షణమే సిడిఎంఎకు రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కలెక్టర్ పి.ప్రశాంతి సిఫార్సుల మేరకు ఈ వేటు పడింది. ఈయన గత పుష్కరాల సమయంలో కొవ్వూరులో కమిషనర్‌గా పని చేశారు. అప్పట్లో జరిగిన పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయి. దీంతో కార్యాలయంలో పనిచేసే పలువురు అధికారుల ఇంక్రిమెంట్లు సైతం కట్ చేయాలని ఉన్నతాధికారుల మంచి ఆదేశాలున్నాయి. పట్టణానికి చెందిన పలువురు టిడిపి ముఖ్య నాయకులకు ఈయన సన్నిహిత బంధువు అయినప్పటికీ బదిలీ వేటుపడటం చర్చానీయాంశమైంది.

స్వర్ణాంధ్రకు చేరిన అనాథ వృద్ధుడు

వృద్ధుని వివరాలను వెల్లడిస్తున్న స్వర్ణాంధ్ర రాంబాబు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గత మూడు నెలలుగా రాజమహేంద్రవరం - రావులపాలెం జాతీయ రహదారిలోని వేమగిరి ఆంజనేయస్వామి గుడి వద్ద అనాథగా పడి ఉన్న వృద్ధుడిని పారా లీగల్ వాలంటీర్ ఎనమదల వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ దృష్టికి తీసుకెళ్లారు. 108 ద్వారా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్య సహాయం అందించారు. అతని పూర్తిగా కోలు కోలేనప్పటికీ ఆసుపత్రిలో ఉన్న ఇబ్బందులు దృష్ట్యా డిశ్చార్జ్ చేశారు. అతన్ని ఎక్కడ ఉంచాలో తెలియక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయాధికారి ఎన్.శ్రీలక్ష్మీ ద్వారా స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించాలని కోరారు. ఆ వద్ధునికి స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు ఆశ్రయం కల్పిస్తామని భరోసా ఇవ్వడంతో అనాథ వృద్ధుని కథ సుఖాంతం అయింది. మహారాష్ట్ర-కర్ణాటక బోర్డర్ దగ్గరలోని పత్తర్వాడికి చెందిన మహదేవ్ హరేవా సావన్ హిందీ, కన్నడ భాషలు అర్థం అవుతున్నాయి. కుటుంబ నిర్లక్ష్యమో ఇతర ఇబ్బందులో తెలియదు. వేమగిరిలోని ఆంజనేయస్వామి ఆలయంలో నివాసం ఉంటున్నాడు. మనిషి బాగా బలహీనంగా ఉండి లేవలేని స్థితిలో ఉన్న అతనిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిఫార్సుతో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించినట్లు స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు తెలిపారు. అయితే ఇతను సమాచారం తెలుసుకుని వారి బంధువులు ఎవరు వచ్చినా తిరిగి వారికి అప్పగిస్తామని, అంతవరకు స్వర్ణాంధ్ర అతనికి సంరక్షణ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పేరా లీగల్ వాలంటీర్ వెంకటేశ్వరరావు, స్వర్ణాంధ్ర సిబ్బంది శంకర్రావు, దివ్య, మీరాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంటు వ్యాధులపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - తాళ్లపూడి

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కోమలి

డయేరియా, ఇమ్యునైజేషన్, రోటా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలపై అవగాహన సదస్సును నిర్వహించారు. బుధవారం మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కోమలి పర్యటించారు. ఈ సందర్భంగా అంటు వ్యాధులపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. అంటురోగాలతోపాటు రానున్న వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తూ ఎంపిక చేసిన గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముందు జాగ్రత్తగా పాటు అవసరమైన చోట్ల మందులు అందించడానికి ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ జె.సంధ్య, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ హారికా గుప్తా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒలు

ప్రజాశక్తి - కొవ్వూరు, తాళ్లపూడి

కొవ్వూరు ఎంపిడిఒగా టిబికె.రమణ బుధవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. తాళ్లపూడి ఎంపిడిఒగా పనిచేస్తున్న రమణ గత కొద్ది కాలంగా కొవ్వూరుకు ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొవ్వూరులో పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందజేశారు.అలాగే తాళ్లపూడి ఎంపిడిఒగా ఎస్.వేణుగోపాల్ రెడ్డి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన దేవరపల్లి నుంచి ఇక్కడకు వచ్చారు.

యోగా సాధన అవసరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీ ఒక్కరికీ నిత్య యోగ సాధన అవసరమని డిఆర్ఒ టి.సీతారామమూర్తి అన్నారు. బుధవారం ఉదయం ఆర్ట్స్ కళాశాల సమీపంలో గ్రాంట్ ట్రంక్ రహదారిలో రెసిడెన్షియల్, ఆయుష్ శాఖ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం యోగ సాధన క్రమం తప్పకుండా చేయడం వలన మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటుందన్నారు. యువతతో పాటు వయసు మీద పడిన మధ్య వయస్కులు, వృద్ధులు క్రమం తప్పకుండా యోగ సాధన చేయడం వలన మందులకు దూరంగా ఉండవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఆయుష్ వైద్యులు డాక్టర్ కెసిహెచ్.రమేష్, ఆయుష్ నోడల్ అధికారి పి.కేజియా, ప్రభుత్వ హోమియో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవివిఎస్.సత్యకుమార్, సూపరింటెండెంట్ పివివిఎస్ఎన్.చౌదరి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు త్వరగా ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

అర్హులైన కౌలు రైతులను గుర్తించి వారికి వేగవంతంగా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో విఆర్ఒలతో నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ పనులు త్వరలో ప్రారంభం కానున్నందున వెంటనే ఈ కౌలు రైతుల గుర్తింపు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో నీటి తీరువా బకాయిలు పూర్తిగా వసూలు చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల వేదికలో ప్రజల నుంచి అధికారులకు అందజేసిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దారు కాంతారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

శ్మశాన స్థలం అప్పగింత

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగి పంచాయతీ పరిధిలోని పలు ప్రభుత్వ ఆస్తులను పంచాయతీకి బుధవారం రెవెన్యూ అధికారులు అప్పగించారు. తహశీల్దార్ పి.త్రినాథరావు ఆదేశాల మేరకు దిండి గ్రామం, సూరేడు దంప, ఎన్‌హెచ్ 216 చెంతన ఉన్న సీతారాంపురం శ్మశాన వాటిక, రామదాసు కాలువలను పంచాయతీకి అప్పగించినట్లు కార్యదర్శి విజెవి.రమణ తెలిపారు. ఈ సర్వేలో సర్వేయర్లు కీర్తి, మణికంఠ, హర్షవర్ధిని ఆయా ప్రభుత్వ ఆస్తులకు హద్దులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, అత్తిలి బాబూరావు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోరంగి అభయారణ్యాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి అభయారణ్యాన్ని శిక్షణ పొందుతున్న ఆంధ్ర క్యాడర్‌కు చెందిన ట్రైనీ కలెక్టర్లు బుధవారం సందర్శించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వరప్రసాద్, ఎఫ్‌బిఒ మహేష్ అభయారణ్య విశేషాలను ట్రైనీ కలెక్టర్లకు తెలియజేశారు. ఆంధ్రదర్శిని కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలను ఏడుగురు ట్రైనీ కలెక్టర్లు సందర్శించినట్లు రేంజర్ వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

(Correction of Name and Parental Detials in ICSE Records - 2025)

Issued on behalf of **Ms. Aenon Carmel Palli,** daughter of **Sri Bartha Lomeo Palli and Smt. Persis Palli,** a student of **St.Joseph's Convent School, Kakinada (Centre No: 1255186, UID: 8600590)** who appeared for the **ICSE Class X Examination - 2025,** conducted by the **CISCE, New Delhi.**

It is observed that the **Pass Certificate cum Statement of Marks (No.TY40009472)** Contains the following inaccuracies:

1. Candidate's Name: Palli Aenon Carmel - "AENON CARMEL PALLI"
2. Mother's Name: Palli Persis "PERSIS PALLI"
3. Father's Name: Palli Bartha Lomeo "BARTHA LOMEO PALLI"

Said corrections are substantiated by the **Brith Certificate** issued by the Kakinada Municipal Corporation (ID: 53301-B-334314).

Accordingly, this notice serves as a formal request to the **Council** and the **School Authorities** to effect the necessary rectifications in the official records and all consequential documentation.

Ms. AENON CARMEL PALLI and her parents unconditionally indemnify and discharge CISCE and the School, including their officials and agents, from any claims or liabilities arising there from.

Any objections, if any, must be submitted **in writing to the undersigned within seven (7) days** from the date of this publication. Failing which, the proposed corrections shall stand affirmed and acted upon.

KARRA VENU, ADVOCATE
Kakinada. #6-3-30, Dantuvari Street,
Dt:17-6-2025 Kakinada. Cell: 9849548272

ప్రకటన

మా క్లయింటు అయిన కాకినాడ జిల్లా, రామేశ్వరం గ్రామం కాపురస్తులు అయిన **అడబాల సూరిబాబు గారి భార్య శ్రీమతి అడబాల చంద్రావతి గారు** మాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

మా క్లయింటు అయిన అడబాల సూరిబాబు గారి భార్య శ్రీమతి అడబాల చంద్రావతి గారి ఆస్తి i.e.49.57 Sq.yards మరియు అందుల డోర్.నెం. 2-178 గల ఇల్లు మొదట వారి తండ్రి గారు అయిన నక్కా పేరయ్య గారిది అయి ఉన్నది. నక్కా పేరయ్య గారు ఏ విదమైన లిఖితపూర్వకంగా పైన ఉదహరించిన ఇంటి గురించి కాగితాలు రాయకుండా కాలం చేసినారు. వారి తదనంతరం, వారికి భార్య నాకు తల్లి గారు అయిన నక్కా సత్యవతి మరియు వారి కుమార్తెలు మా క్లయింటు అయిన శ్రీమతి అడబాల చంద్రావతి గార్లు వగైరాలు ఉమ్మడిగా వారసత్వపురీత్యా అనుభవిస్తూ ఉన్నారు.

పైన ఉదహరించిన ఇంటిని మా క్లయింటు తల్లి గారు అయిన నక్కా సత్యవతి గారు మరియు మా క్లయింటు తోబుట్టువులు మా క్లయింటు కు రిజిస్టర్ సెటిల్మెంట్ దస్తావేజు రీత్యా ది.18-09-2021 **దస్తావేజు నెం.9165/2021** గా రిజిస్టర్ చేసి ఇచ్చినారు.

మా క్లయింటు ఆమె ఇంటిని కాకినాడ వాస్తవ్యులు అయిన పిల్లి నాగ మల్లేశ్వర రావు గారి కుమారుడు పిల్లి భీమరాజు గారికి విక్రయించుటకు అంగీకారం కుదుర్చుకోవడం జరిగింది.

కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింటు విక్రయించే విషయంలో కానీ, నక్కా పేరయ్య గారి లీగల్ హెయిర్స్ విషయంలో కానీ ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల ఈ దినము నుండి 7 దినములలోగా పైన ఉదహరించిన మా క్లయింటు అడ్రస్‌కు లేక మాకు కానీ తెలియపరచవలెను. తదుపరి ఎవరైననూ, ఎట్టి అభ్యంతరములైననూ తెలిపిన యెడల అవి మా క్లయింటును బైండు చేయవు. అట్టివి చెల్లనేరవు.

వక్కలంక సత్యనారాయణమూర్తి
P(V). వాణిశ్రీ, M(T).రాజశ్రీ, T.S. రత్నాకర్, అడ్వకేట్స్,
డో.నెం.7-9-29/a, సాంబమూర్తి వీధి,
రామారావుపేట, కాకినాడ.సెల్: 98490 12112

CHANGE OF NAME

I, **KOTHAPALLI LAKSHMI KANTHAM,** W/o. Kothapalli Abbulu, D.No. 5-235, Subbarao peta, Katheru, E.G.Distrct, A.P., Pin: 533105, I have changed my name from **KOTTAPALLI LAKSHMI KANTAM** (Old Name) to **KOTHAPALLI LAKSHMI KANTHAM** (New Name). Hence forth Iam being called **KOTHAPALLI LAKSHMI KANTHAM,** W/o. Kothapalli Abbulu, for all purpose.

CHANGE OF NAME

I, **KOTHAPALLI ABBULU,** S/o. Kothapalli Tatayya, D.No. 5-235, Subbarao peta, Katheru, E.G.Distrct, A.P., Pin: 533105, I have changed my name from **KOTTAPALLI ABBULE** (Old Name) to **KOTHAPALLI ABBULU** (New Name). Hence forth Iam being called **KOTHAPALLI ABBULU,** S/o. Kothapalli Tatayya, for all purpose.

CHANGE OF NAME

I, **KOTHAPALLI PRUDHVI KISHORE,** S/o. kothapalli Abbulu, D.No. 5-235, Subbarao peta, Katheru, E.G.Distrct, A.P., Pin: 533105, I have changed my name from **KOTTAPALLI PRUDHVI KISHORE** (Old Name) to **KOTHAPALLI PRUDHVI KISHORE** (New Name). Hence forth Iam being called **KOTHAPALLI PRUDHVI KISHORE,** S/o. Kothapalli Abbulu, for all purpose.

దస్తావేజులు పోయినవి

పిఠాపురం మండలం, గోకివాడ గ్రామమునకు చెందిన వాసిరెడ్డి వీరభాస్కరమణి భర్త: వీరభద్రరావు గారికి పిఠాపురం సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసులో రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజు నెం.2181/2005 చెందియున్నది. సదరు దస్తావేజులను ది.10-06-2025వ తేదీన పిఠాపురంలో మా ఇంటి నుండి బ్యాంకు దగ్గరకు వెళుతుండగా మార్గమధ్యంలో అనగా కూరగాయల మార్కెట్ సమీపంలో ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు.

వాసిరెడ్డి వీరభాస్కరమణి
భర్త: వీరభద్రరావు, పల్లపువీధి రామాలయం, గోకివాడ
పిఠాపురం మండలం, సెల్:9391178375

కోర్టు నోటీసు
గౌరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి
(అదనపు సివిల్ జడ్జి
జూనియర్ డివిజన్) రామచంద్రపురం
ఓ.ఎస్. నెం.224/2022

Between: గెద్దం శ్రీనివాసరావు -వాది
1. జుత్తిగ వీరబ్రహ్మం
2. జుత్తిగ శ్రీను -ప్రతివాదులు

1వ ప్రతివాది చిరునామా:
జుత్తిగ వీరబ్రహ్మం, తండ్రి: ఏడుకొండలు, హిందూ, వయస్సు:48, వృత్తి: వ్యాపారం, ఇంటి నెంబర్ 5-158, కొత్త ఇళ్ళు వద్ద, దంగేరు, కె.గంగవరం మండలం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

Defandant-1 (మొదటి ప్రతివాది) పై నెంబర్ గల దావా ఓ.ఎస్. 224/2022 లో మీరు మొదటి ప్రతివాదిగా ఉన్నారు. మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికీ మీరు తీసుకోని కారణంగా గౌరవ కోర్టు వారు ఈ నోటీసును పేపర్ పబ్లికేషన్ వేయమని ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. తదుపరి వాయిదా ది. 24-6-2025 గా ఉంది. కావున పై తేదీన మీరు గానీ, మీరు నియమించిన న్యాయవాది గానీ కోర్టుకు హాజరు కావాల్సిందిగా గౌరవ కోర్టు వారు ఆదేశించారు. కావున మీరు ది. **24-6-2025**న రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, రామచంద్రపురం వారి సమక్షంలో హాజరు కావాల్సిందిగా కోరడమైనది. లేనిపక్షంలో దావా మీ పరోక్షంగా తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)
టి.వి.గోవిందరావు,
టి.ఆర్.లక్ష్మి,
జె.ఎస్.ఎస్.చక్రవర్తి, అడ్వకేట్స్,
ఎస్.వి.బి.లా ఛాంబర్, సత్యశ్రీ రోడ్,
17-6-2025, మండపేట-533308
రామచంద్రపురం ఫోన్ :- 7416601159